# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శుక్రవారం - 14 - ఆగస్టు - 2026 | సంపుటి : 4 | సంచిక : 71 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## కాళేశ్వరం నుంచి యూనిటీ మాల్ వరకు సీబీఐ విచారణ జరపాలి

- ముఖ్యమంత్రి వెంటనే కేంద్రానికి లేఖ రాయాలి
- ప్రజల ఆస్తుల విక్రయానికి ప్రభుత్వాలకు హక్కు లేదు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతిపై సమగ్ర దర్యాప్తు కోరిన రఘునందన్ రావు

హైదరాబాద్, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు): కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై కేవలం మూడు బ్యారేజీలకే పరిమితం కాకుండా, ప్రాజెక్టు రూపకల్పన నుంచి నిధుల వినియోగం, తుది చెల్లింపుల వరకు మొత్తం వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు

మిగతా 2లో..






## మైనారిటీల అభ్యున్నతే లక్ష్యం : సీఎం

ప్రతిభకు ప్రజా ప్రభుత్వం అండ

తెలంగాణ మైనారిటీల ప్రతిభా సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి

782 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు, ఉద్యోగార్థులకు అభినందనలు

నైపుణ్యాభివృద్ధితోనే యువత భవిష్యత్తు మారుతుందని స్పష్టం

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు): హిందూ, ముస్లింల మధ్య తనకు ఎలాంటి వ్యత్యాసం లేదని, ఇద్దరూ తనకు రెండు కళ్లలాంటి వారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ మైనారిటీల ప్రతిభా సదస్సులో పాల్గొన్న ఆయన, వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎంపికైన అభ్యర్థులు తెలంగాణ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 ఉద్యోగాల్లో ఎంపికైన వారితో పాటు నీట్, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 782 మంది మైనారిటీ విద్యార్థులు, అభ్యర్థులను అభినందించారు. చదువే జీవితాన్ని మార్చగల అత్యంత శక్తివంతమైన సాధనమని ముఖ్యమంత్రి అన్నారు. విద్యార్థులు ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు క్రమశిక్షణతో అభ్యసించడంతో పాటు నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నైపుణ్యం ఉన్న యువతకు

మిగతా 2లో..

## రైతు సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచాలి

- నకిలీ డీఏపీ తయారీదారులపై కఠిన చర్యలకు ఆదేశాలు
- ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ
- మార్కెట్లలో ఆర్‌డీ వ్యవస్థ నిర్మూలనకు కఠిన చర్యలు

హైదరాబాద్, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, వస్త్ర శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం సచివాలయంలో తన శాఖల పరిధిలోని వివిధ విభాగాలు, సంస్థల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అమలు చేస్తున్న పథకాలు,

మిగతా 2లో..



## ప్రభుత్వంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర విమర్శలు

- లక్షలాది ఆడబిడ్డల జీవితాలపై ప్రభావం పడిందని ఆరోపణ
- ప్రభుత్వం సమీక్ష నిర్వహించిందా అని ప్రశ్న
- ప్రజల ముందుకు పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్



హైదరాబాద్, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు): కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ పథకాలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడటానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆరోపించారు. పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రభుత్వం కావాలనే రద్దు చేయించే పరిస్థితి తీసుకొచ్చిందని ఆయన ఆరోపించారు. ఈ నిర్ణయాల వల్ల లక్షలాది ఆడబిడ్డల భవిష్యత్తుపై

మిగతా 2లో..

## తిరంగా ర్యాలీలో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ

- ఐడీపీఎల్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ కార్యక్రమం
- జాతీయ ఐక్యతకు ప్రతీకగా త్రివర్ణ పతాక యాత్ర
- వికసిత భారత్ లక్ష్య సాధనకు ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపు
- ఎంపీ ఈటల రాజేందర్



మేడ్చల్, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు): ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఐడీపీఎల్ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడు ఈటల రాజేందర్ పాల్గొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఈటల ప్రస్తుతం ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ర్యాలీలో భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొని జాతీయ జెండాలతో దేశభక్తి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ భారతదేశం అనేక భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన దేశమైనప్పటికీ జాతీయత అనే భావన అందరినీ ఏకం చేస్తోందని అన్నారు. జనగణమన, వందేమాతరం వంటి జాతీయ గీతాలు దేశ సమైక్యతకు ప్రతీకలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

భారత్ మాత సంతానంగా ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ యువత దేశ నిర్మాణంలో ముందుండాలని సూచించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం దేశభక్తి భావాలను మరింత బలోపేతం చేస్తోందని తెలిపారు. ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠను పెంచడంలో ప్రధాని

మిగతా 2లో..



## నిషేధిత భూముల హక్కుదారులకు సీఎం భరోసా

- కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన
- 22-ఏ భూముల సమస్యలకు బై నంబర్లతో పరిష్కారం
- కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శ్రీకారం
- పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో

## బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

- 119 నియోజకవర్గాల్లో 1.19 లక్షల పంపిణీ
- ఆగస్టు 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- స్వయం ఉపాధితో ఆర్థిక సాధికారతే లక్ష్యం
- మంత్రి పొన్నం ప్రభాకర్




హైదరాబాద్, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు): బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఊతమిచ్చే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తోందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి చొప్పున మొత్తం 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12 వేలుగా ఉండగా, లబ్ధిదారులకు 100 శాతం సబ్సిడీపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నిషేధిత భూముల హక్కుదారులకు సీఎం భరోసా

**హైదరాబాద్, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** నిషేధిత జాబితా (22ఏ)లో ఉన్న భూములకు సంబంధించి హక్కుదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కోర్టు వివాదాల్లో ఉన్న భూములను మాత్రమే పక్కనపెట్టి, మిగతా భూములకు బై నంబర్లు కేటాయించడం ద్వారా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్లు (టవర్స్)కు గురువారం శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నిషేధిత జాబితాలో చేరిన భూముల విషయంలో ప్రజల్లో ఉన్న సందేహాలను తొలగించే ప్రయత్నం చేసిన ముఖ్యమంత్రి, కొనుగోలు చేసిన హక్కుదారుల ఆస్తులు ఎక్కడికీ పోవని స్పష్టం చేశారు. గతంలో ఒకే సర్వే నంబర్‌లో కొంత భాగం వివాదంలో ఉన్నా మొత్తం భూమిని నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఇప్పుడు కోర్టు వివాదాలు లేని భాగాలను గుర్తించి బై నంబర్లు కేటాయించడం ద్వారా హక్కుదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. ఈ అంశంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.కూకట్‌పల్లి ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి శ్రీధర్‌బాబుకు ముఖ్యమంత్రి సూచించారు.

రోడ్లు, ఫ్లైఓవర్లు, చెరువుల పునరుద్ధరణ, విద్యా సంస్థల ఏర్పాటు, పరిశ్రమల అభివృద్ధి వంటి అంశాల్లో ఈ ప్రాంతాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. కూకట్‌పల్లి ప్రజలకు ప్రభుత్వం రుణపడి ఉందని, వారి అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ, గత ప్రభుత్వ హయాంలో అమలైన ఏ సంక్షేమ పథకాన్నీ కూడా నిలిపివేయలేదని, వాటికి అదనంగా కొత్త కార్యక్రమాలను ప్రారంభించామని ముఖ్యమంత్రి తెలిపారు. 3.28 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు భారీ స్థాయిలో బ్యాంకు లింకేజీ వంటి పథకాలను ప్రస్తావించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామని, వేలాది కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండేళ్లలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. మహిళా సంఘాల కోసం వెయ్యి బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి, మహిళా బజార్ల ఏర్పాటు, స్వయం ఉపాధి అవకాశాల కల్పన వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ, పట్టణ మహిళలకు కొత్త అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం నగర పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, కంటోన్మెంట్, ఎల్బీనగర్, ఉప్పల్ వంటి ప్రాంతాల్లో పేదలకు నాణ్యమైన గృహాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదలకు కేటాయించే ఇళ్లపై రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా రద్దు చేయాలని మంత్రులకు సూచించినట్లు వెల్లడించారు. నగరంలో నిరుపేదలు ఎక్కడ నివసిస్తున్నారో అక్కడే వారికి గృహాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, తెలంగాణను వికాసం వైపు నడిపించేందుకు తాను నిరంతరం శ్రమిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు.

# మైనారిటీల అభ్యున్నతే లక్ష్యం : సీఎం

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ విస్తృత అవకాశాలు ఉన్నాయని, జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో కూడా నిపుణుల అవసరం పెరుగుతోందని చెప్పారు. యువతను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఈ క్రమంలోనే ఐటీఐలను ఆధునిక శిక్షణ కేంద్రాలుగా అభివృద్ధి చేయడంతో పాటు పాలిటెక్నిక్ కళాశాలలను నైపుణ్య విశ్వవిద్యాలయ పరిధిలోకి తీసుకువచ్చినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. చిన్న కుటుంబాల నుంచి ఎంతో కష్టపడి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల విజయాలు ఇతర యువతకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. నైపుణ్యంతో కూడిన విద్యే సమాజంలో స్థిరమైన అభివృద్ధికి మార్గమని చెప్పారు. మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. నాలుగు శాతం రిజర్వేషన్లను తొలగించే ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి విజయవంతం కాలేదని గుర్తు చేశారు. సంక్షేమ పథకాల అమలులో మైనారిటీలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా అనేక కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఉద్యోగ నియామకాల విషయంలో గతంలో ఏర్పడిన సమస్యలను అధిగమించి పారదర్శక వ్యవస్థను తీసుకువచ్చామని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నిపుణులతో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేసిన తర్వాతే నియామక ప్రక్రియ వేగవంతమైందన్నారు. పరీక్షలను అడ్డుకునేందుకు పలు ప్రయత్నాలు జరిగినప్పటికీ ప్రభుత్వం న్యాయపరంగా పోరాడి నియామకాలను పూర్తి చేసిందని వెల్లడించారు. అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఉద్యోగాలు సాధించిన వారు ప్రజలకు సేవ చేయడాన్ని తమ బాధ్యతగా భావించాలని, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజార్‌ఉద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, టీజీఎంఆర్‌ఈఐఎస్ అధ్యక్షుడు ఫహీం ఖురేషీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం నుంచి యూనిటీ మాల్ వరకు సీబీఐ విచారణ జరపాలి

(మొదటి పేజీ తరువాయి)

సంస్థ సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిగితేనే నిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్రానికి అధికారికంగా లేఖ రాయాలని సూచించారు. కాళేశ్వరం అంశంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లేఖ పంపితే తాను స్వయంగా కేంద్ర హోంమంత్రిని కలిసి విచారణ వేగవంతం అయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రజాధనం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ప్రాజెక్టులో అవకతవకల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పూర్తి స్థాయి దర్యాప్తు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.202 కోట్ల నిధులు, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూమితో చేపట్టనున్న యూనిటీ మాల్ ప్రాజెక్టుపై కూడా ఆరోపణలు వస్తున్నాయని ఎంపీ పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలను కూడా సీరియస్‌గా తీసుకుని విచారణ జరపాలని కోరారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన వ్యవహారాలపై విచారణలు జరిగినప్పుడు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధించిన ఆరోపణలపై కూడా దర్యాప్తు జరగకూడదనే కారణం ఏంటని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన 10 ఎకరాల భూకేటాయింపు వ్యవహారంతో పాటు ప్రస్తుతం యూనిటీ మాల్‌కు సంబంధించిన ఒప్పందాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు, కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు రఘునందన్ రావు వెల్లడించారు. ప్రభుత్వ భూములు, ప్రజా వనరులకు సంబంధించిన ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉండాలని, అనుమానాలకు తావు లేకుండా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు సంబంధించిన ఆస్తుల విషయంలో జవాబుదారీతనం తప్పనిసరి అని అన్నారు.హైదరాబాద్‌లో ఎకరం భూమి విలువ వందల కోట్ల రూపాయలకు చేరిందని, అలాంటి విలువైన ప్రజా ఆస్తులను విక్రయించే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని ఎంపీ స్పష్టం చేశారు. ప్రభుత్వాలు ప్రజా ఆస్తులకు యజమానులు కాదని, కేవలం వాటి సంరక్షకులుగా మాత్రమే వ్యవహరించాలని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రజా ఆస్తుల విషయంలో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రజల సొమ్మును దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని రఘునందన్ రావు తీవ్ర విమర్శలు చేశారు. అవినీతి విషయంలో ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి రెండు వైపులా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రింగ్ రోడ్డు, ఫార్ములా ఈ రేస్, కాళేశ్వరం వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు మారుస్తూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలకు ముగింపు పలకాలంటే తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

# రైతు సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాల పురోగతిని శాఖల వారీగా సమీక్షించిన మంత్రి, రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విబ్ జి రామ్ జి పథకం కింద ఎకో పాండ్లు, వెదురు సాగు చేపట్టేందుకు పంచాయతీరాజ్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్ధారించిన తొమ్మిది వరి రకాలను సాగు చేసిన రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకునేలా రైతు వేదికల ద్వారా అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందజేస్తున్న యంత్రాల పంపిణీపై మంత్రి ఆరా తీశారు. సబ్సిడీపై యంత్రాల పంపిణీలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. రైతులకు సేవలందించేందుకు అవసరమైన సిబ్బందిని భర్తీ చేసుకోవాలని, అవసరమైతే ఇతర శాఖల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చే ప్రతి రూపాయిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే ఉద్యోగుల హాజరును పర్యవేక్షించే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అన్ని శాఖల్లో అమలు చేసి విధులకు ఆలస్యంగా హాజరయ్యే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. నర్సరీల్లో మిగిలిపోయిన మొక్కలను వెంటనే విక్రయించి, కొత్త మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు మొక్కలు అందుబాటులో లేవనే పరిస్థితి ఉండకూడదని, దరఖాస్తు చేసిన రెండు మూడు రోజుల్లోనే మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఏడాది రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఆయిల్‌పామ్ మిల్లుల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా ట్రయల్ రన్స్ ప్రారంభించాలని, ప్రతి ఉమ్మడి జిల్లాకు కనీసం ఒక ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఉండేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. నకిలీ డీఏపీ తయారీ, విక్రయాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసి, ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు వివరించారు. ఇందులో సంబంధం ఉన్న ఎవరినీ వదిలిపెట్టవద్దని మంత్రి ఆదేశించారు. నకిలీ ఎరువులను ఎవరెవరికి విక్రయించారనే పూర్తి వివరాలు సేకరించి, నష్టపోయిన రైతులకు సంబంధిత వ్యక్తుల నుంచే పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## గ్రామ కమిటీల పరిశీలనలో కాంగ్రెస్ నాయకులు

**వేలేరు, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):**పార్టీ సంస్థాగత పునర్నిర్మాణంలో భాగంగా వేలేరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు పి. కనకయ్య, బి. మహేందర్ తదితరులు మద్దెలగూడెం, లోక్యాతండ, శాలపల్లి, గొల్లకిష్టంపల్లె గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీల పరిశీలన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీలు ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందేలా కృషి చేయాలని సూచించారు. మిగిలిన గ్రామాల పరిశీలన అనంతరం కమిటీల వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు.



# భవనంపై నుంచి దూకి యువకుడి మృతి

- **'దొంగ.. దొంగ' అని కేకలు వేయడంతో భయంతో దూకిన వైనం.**
- **సీసీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులు.**




**సత్తుపల్లి, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** అర్ధరాత్రి ఓ ఇంట్లోకి వెళ్లిన యువకుడిని దొంగగా భావించి కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో భయాందోళనకు గురైన యువకుడు భవనం రెండో అంతస్తు నుంచి దూకి మృతి చెందిన ఘటన సత్తుపల్లి పట్టణంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎన్టీఆర్ జిల్లా పెనమలూరు మండలం పోరంకి గ్రామానికి చెందిన బొడ్డు వినీత్ (29) సత్తుపల్లి-వేంసూరు రోడ్డులోని విస్తార్ ఫైనాన్స్ సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో అద్దె గదిలో నివాసం ఉంటున్నాడు. గురువారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో వినీత్ నగర పంచాయతీ, మిలీనియం స్కూల్ రోడ్డు ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ ఓ భవనంపైకి ఎక్కి ఓ ఇంట్లోకి ప్రవేశించాడు. అతడిని గమనించిన కుటుంబ సభ్యులు ఒక్కసారిగా 'దొంగ.. దొంగ' అంటూ కేకలు వేయడంతో వినీత్ భయాందోళనకు గురయ్యాడు. వెంటనే అక్కడి నుంచి బయటకు వచ్చి భవనం రెండో అంతస్తు నుంచి కిందికి దూకాడు. కింద ఉన్న రాయిపై తల బలంగా తగలడంతో తీవ్ర గాయమై రక్తస్రావమైంది. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించగా.. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వినీత్‌ను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టి భవనంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ఘటనకు ముందు వినీత్ ఎక్కడి నుంచి వచ్చాడు? భవనం పైకి ఎందుకు వెళ్లాడు? ఇంట్లోకి ప్రవేశించడానికి కారణమేంటి? కుటుంబ సభ్యులు కేకలు వేయడంతోనే భవనం నుంచి దూకాడా? అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. సీసీ ఫుటేజీతో పాటు స్థానికులు, ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఘటనకు దారితీసిన పూర్తి కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

(మొదటి పేజీ తరువాయి)

అందజేయనున్నట్లు చెప్పారు.

అర్హులైన బీసీ మహిళల నుంచి ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని మంత్రి తెలిపారు. కుట్టు వృత్తిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలు, నిరాశ్రయులు, అనాథలు, దివ్యాంగులు, కుట్టు వృత్తిలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత కల్పించనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జరుగుతుందని స్పష్టం చేశారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. కుట్టు మిషన్ల వినియోగంపై అవసరమైన శిక్షణ కూడా అందజేస్తామని తెలిపారు. మొదటి దశలో 1.19 లక్షల మంది మహిళలకు ప్రయోజనం కల్పించనున్నామని, భవిష్యత్తులో మరింత విస్తరించే అవకాశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

మహిళల ఉపాధి అవకాశాల పెంపు కోసం ప్రభుత్వం ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం, వివిధ స్వయం ఉపాధి కార్యక్రమాలు అమలు చేస్తోందని మంత్రి గుర్తుచేశారు. ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ల పథకం ద్వారా మహిళలు ఇంటి నుంచే ఆదాయం పొందే అవకాశాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

# తిరంగా ర్యాలీలో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ

(మొదటి పేజీ తరువాయి)

నరేంద్ర మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందని ఈటల రాజేందర్ అన్నారు. ఆర్థిక, సాంకేతిక, వ్యూహాత్మక రంగాల్లో భారత్ వేగంగా ముందుకు సాగుతోందని, 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనకు ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. మోదీ నాయకత్వానికి ప్రజల మద్దతు కొనసాగాలని ఆకాంక్షించారు. జాతీయ జెండా ప్రతి భారతీయుడి గౌరవానికి ప్రతీక అని పేర్కొన్న ఆయన, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. యువతలో జాతీయ చైతన్యం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, మల్లారెడ్డి, వడేపల్లి రాజేశ్వర్ రావు, కొల్లి మాధవి, జేకే శేఖర్ యాదవ్, నల్ల జయశేఖర్ గౌడ్, తాడూరి శ్రీనివాస్, విజయలక్ష్మి సుబ్బారావు తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తిరంగా ర్యాలీతో ఐడీపీఎల్ చౌరస్తా పరిసరాలు జాతీయ జెండాల రెపరెపలతో దేశభక్తి వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# ప్రభుత్వంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావం పడిందని పేర్కొన్నారు. పేద కుటుంబాలు తమ కుమార్తెల వివాహాల కోసం ఈ పథకాలపై ఆధారపడుతున్నాయని, అలాంటి కీలక పథకాల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించలేదని విమర్శించారు.రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఉద్దేశించి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పలు ప్రశ్నలు సంధించారు. కళ్యాణలక్ష్మి పథకానికి సంబంధించిన వ్యవహారం కోర్టులో కొనసాగుతున్న సమయంలో సంబంధిత అధికారులతో ఎప్పుడైనా సమీక్ష సమావేశం నిర్వహించారా అని ప్రశ్నించారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. పథకంపై నెల రోజులుగా న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపలేదని ఆయన ఆరోపించారు. ఒకవేళ సమీక్షలు నిర్వహించి ఉంటే వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. ప్రభుత్వ వైఖరి వల్ల లబ్ధిదారుల్లో ఆందోళన పెరుగుతోందని పేర్కొన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని సూచించారు. పేదల ప్రయోజనాలను కాపాడే దిశగా వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, ప్రజల సందేహాలకు సమాధానం చెప్పాలని ఆయన కోరారు. ఈ అంశంపై ప్రజా వేదికల్లో చర్చకు సిద్ధమని ప్రకటిస్తూ, ప్రభుత్వం తమ వద్ద ఉన్న పూర్తి సమాచారాన్ని ప్రజల ముందుంచాలని సవాల్ విసిరారు. పేదల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

# రాత్రికి రాత్రే పత్తి పంట ధ్వంసం.. న్యాయం చేయాలని రైతుల వేడుకోలు

**వేలేరు, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):**వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన వేముల కొరయ్య, కాషయ్య, వెంకటయ్య, మల్లయ్య, రాజయ్య, మల్లయ్యలకు చెందిన 16.4 గుంటల భూమిలో సాగు చేసిన పత్తి పంటను



కొందరు వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.బాధిత రైతుల వివరాల ప్రకారం, తమ భూమిలో పత్తి సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నామని, అయితే అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు భూమి తమదేనని పేర్కొంటూ దౌర్జన్యానికి పాల్పడ్డారని తెలిపారు. రాత్రి వేళలో సుమారు 6 ఎకరాల మేర పత్తి పంటను పీకేసి తీవ్ర నష్టం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వేలేరు ఎస్సై సురేష్ తెలిపారు

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణి

**వేలేరు, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):-** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నూతన యూనిఫాంలను అందజేస్తున్న నేపథ్యంలో వేలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలలో యూనిఫాంల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వేలేరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బిల్లా యాదగిరి, ఎంపీడీఓ కిషన్ నాయక్ పాల్గొని విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేశారు.




ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన యూనిఫాంలను అందజేస్తోందని తెలిపారు. యూనిఫాంల కుట్టు బాధ్యతలను స్థానిక మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను అందిస్తోందని, విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉన్నత మరియు ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న మొత్తం 329 మంది విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంఈఓ చంద్రమౌగిళి, ఎంపీఓ బుచ్చిరెడ్డి, ఏపీఎం అనిత, జీపీ కార్యదర్శి విజయ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యం, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లీలాబాయి, సీసీ రమాదేవి, గ్రామంలోని నాలుగు వీవోల అధ్యక్షులు, సీఏలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శుక్రవారం - 14 - ఆగస్టు 2026



## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి




- **వెల్టూర్ సర్పంచ్ అశోక్**

**పెద్దమందడి,ఆగస్టు13(తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థులు కష్టపడి చదువుకుని భవిష్యత్తులో అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదగాలని పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ సర్పంచ్ అశోక్, ఏపీసీ చైర్‌పర్సన్ నందిని సూచించారు. గురువారం వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రభుత్వం నూతనంగా పంపిణీ చేసిన స్కూల్ యూనిఫామ్‌లను విద్యార్థులకు అందజేశారు .ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక, ఇతర రంగాల్లో తమ ప్రతిభను చాటుకోవాలని, అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని కోరారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు.ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాణం విష్ణు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శాఖ వెంకటయ్య, మాజీ సర్పంచ్ బాలచంద్రయ్య, గొర్రె వెంకటయ్య, నరాల ఆంజనేయులు, బుస్సయ్య, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల అవసరాల కోసం నిర్మించిన పబ్లిక్ టాయిలెట్‌కు తాళమే దిక్కు



**పెద్దమందడి,ఆగస్టు13(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల సౌకర్యార్థం వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్ నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. మండల కేంద్రం కావడంతో వివిధ గ్రామాల నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు బస్టాండ్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులకు ఉపయోగపడేలా ప్రభుత్వ నిధులతో ఈ పబ్లిక్ టాయిలెట్‌ను నిర్మించారు. అయితే నిర్మాణం పూర్తయి కొంతకాలం గడుస్తున్నా ఇప్పటివరకు ప్రారంభించకపోవడంతో ప్రజలకు అందుబాటులోకి రాలేదు.బస్టాండ్ ఆవరణలో నిర్మించిన ఈ సౌకర్యం అందుబాటులోకి రాకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్‌కు తాళం వేసి ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ప్రజాధనంతో నిర్మించిన భవనం వెంటనే వినియోగంలోకి తీసుకురావాల్సి ఉండగా, ప్రారంభోత్సవం జరగకపోవడంతో ప్రభుత్వ నిధులు వెచ్చించినా ప్రజలకు ప్రయోజనం దక్కడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.మండల కేంద్రంలోని బస్టాండ్‌కు ప్రతిరోజూ వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అలాంటి ప్రదేశంలో ప్రజలకు ఎంతో అవసరమైన పబ్లిక్ టాయిలెట్ నిర్మాణం పూర్తయిన తర్వాత కూడా తాళం వేసి ఉంచడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే ప్రారంభించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.ఈ విషయంపై పంచాయతీ రాజ్ ఇంజనీర్ రమేష్ నాయుడును వివరణ కోరగా, పబ్లిక్ టాయిలెట్‌ను ప్రారంభించేందుకు గ్రామ సర్పంచ్‌తో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరో మూడు నాలుగు రోజుల్లో ప్రారంభోత్సవం జరిగేలా చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

# అమ్మపల్లి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం






- **వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి**

**పెద్దమందడి,ఆగస్టు13( తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పాలనా సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన గ్రామపంచాయతీ భవనం ద్వారా గ్రామ ప్రజలకు మెరుగైన పాలన, ప్రజా సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు.అనంతరం గ్రామంలో నిర్మించనున్న మహిళా సమైక్య భవనానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి భూమిపూజ చేశారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇటువంటి భవనాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.అమ్మపల్లి గ్రామ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతూ, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గ్రామంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాధవి వెంకటేశ్వర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు క్యామ నవనీత రాజు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, పెద్దమందడి మండలాధ్యక్షుడు వెంకటస్వామి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐ. సత్యరెడ్డి, గట్టు యాదవ్, శ్రీనివాసులు, బాలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, గ్రామ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే మేఘారెడ్డి

**పెద్దమందడి,ఆగస్టు13(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా అమ్మపల్లి గ్రామ సర్పంచ్ గౌని మాధవి భర్త వెంకటేశ్వర్ రెడ్డి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే మేఘారెడ్డి, సర్పంచ్ భర్త వెంకటేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మేఘారెడ్డి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. సర్పంచ్ గౌని మాధవి భర్త వెంకటేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడంతో కుటుంబ సభ్యులు, గ్రామ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌని మాధవి, గ్రామ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# పెద్దమందడిలో బీజేపీ హర్ ఘర్ తిరంగా ర్యాలీ


**పెద్దమందడి,ఆగస్టు13(తెలంగాణ ముచ్చట్లు):** దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థులు చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని దేశభక్తి నినాదాలు చేస్తూ పెద్దమందడి ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండా ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని నాయకులు పిలుపునిచ్చారు .ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య మాట్లాడుతూ దేశ సమైక్యత, సార్వభౌమత్వం, జాతీయ భావాన్ని పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములై జాతీయ జెండాకు గౌరవం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య, మాజీ అధ్యక్షుడు తిరుపతయ్య, విట్టల్ రెడ్డి, రాము, నాయకులు, కార్యకర్తలు, పాఠశాల, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# సాయిస్ఫూర్తి కళాశాలలో రక్తదాన శిబిరం!

- **85 మంది విద్యార్థుల నుంచి రక్త నమూనాల సేకరణ**

**సత్తుపల్లి, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):-** మండల పరిధిలోని సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), సాయిస్ఫూర్తి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఖమ్మం మదర్ బ్లడ్ బ్యాంక్ సొసైటీ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో 85 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి, వారి రక్త గ్రూపులను గుర్తించి రక్తాన్ని సేకరించి భద్రపరిచారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన వైద్యులు, సాంకేతిక సిబ్బంది పర్యవేక్షణలో శిబిరం కొనసాగింది. అత్యవసర సమయాల్లో అవసరమైన అన్ని రక్త గ్రూపులు అందుబాటులో ఉండేలా రక్తాన్ని సేకరించి భద్రపరుస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి తెలిపారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్, సీఈఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ షేక్ యాకూబ్ మాట్లాడుతూ.. 2009 నుంచి తమ కళాశాల ఎన్ఎస్ఎస్, సాయిస్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి అవసరమైన రక్తం అందేలా రక్తాన్ని సేకరించి భద్రపరచడంతో పాటు బాధితులకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రక్తదానం చేసిన విద్యార్థినీ, విద్యార్థులకు మదర్ బ్లడ్ బ్యాంక్ సొసైటీ ప్రతినిధులు పండ్లు, జ్యూస్ పంపిణీ చేసి అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కళాశాల సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ షేక్ మీరాసాహెబ్, ఫ్యాకల్టీ సభ్యులు, అన్ని ఇంజనీరింగ్ విభాగాల అధిపతులు, ఎన్ఎస్ఎస్ అధికారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ బలుసుపాటి సీతారాములు తదితరులు పాల్గొని రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు.




# ప్రజా సమస్యల పరిష్కారమే కౌశిక్ రెడ్డి లక్ష్యం

**వీణవంక, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమమే ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రాజకీయాల ప్రధాన లక్ష్యమని కరీంనగర్ జిల్లా వీణవంక బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కామిడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపై స్పందిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న నాయకుడు కౌశిక్ రెడ్డి అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, రైతుల సమస్యలు, యువత ఉపాధి, హుజురాబాద్ డంపింగ్ యార్డు వంటి అంశాలపై ఆయన నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు.కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వడితల ప్రణవ్ ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా కేవలం విలేకరుల సమావేశాలు, సామాజిక మాధ్యమాల ప్రచారానికే పరిమితమవుతున్నారని విమర్శించారు. ప్రజల మధ్య ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. డంపింగ్ యార్డు, రైతుల సమస్యలు, ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి, తాగునీరు, ధాన్యం కొనుగోళ్లు, మున్సిపల్ సమస్యలపై వడితల ప్రణవ్ తన వైఖరిని ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. హుజురాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం, డంపింగ్ యార్డు రద్దు కోసం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేస్తున్న పోరాటానికి ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని కామిడి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ఖబర్దార్ కౌశిక్ రెడ్డి..పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడితే ఊరుకోం



**వీణవంక, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబుకు పెరుగుతున్న ఆదరణను చూసి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఓర్వలేకపోతున్నారని వీణవంక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి ఆరోపించారు.

కాంగ్రెస్ మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కమలాపూర్ మండలంలోని నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించేందుకు ప్రణవ్‌బాబు చొరవతో, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సహకారంతో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

అయితే ప్రణవ్‌బాబుకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో వివాదం సృష్టించారని ఆరోపించారు. ప్రణవ్‌బాబుపై కౌశిక్ రెడ్డి అనుచరులు ఇష్టారీతిన విమర్శలు చేయడం సరికాదని హెచ్చరించారు.

"దమ్ము, ధైర్యం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలి.. వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదు" అని రఘుపాల్ రెడ్డి స్పష్టం చేశారు. కౌశిక్ రెడ్డి వంటి నాయకుడు నియోజకవర్గానికి అవసరం లేదని, ఆయనను వీణవంక మండలంలో తిరగనివ్వబోమంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# వృద్ధులు, బీడీ కార్మికుల పెన్షన్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

- **బీజేపీ సీనియర్ నాయకుడు మట్ట పవన్ రెడ్డి డిమాండ్**



**ఇల్లందకుంట, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లను వెంటనే అమలు చేయాలని కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల బీజేపీ సీనియర్ నాయకుడు మట్ట పవన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో గత ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పెన్షన్లను పెంచి ఇస్తామని హామీ ఇచ్చిందని, అయితే రెండున్నరేళ్లు గడిచినా పెన్షన్ల పెంపుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండా ప్రజలను అయోమయానికి గురిచేస్తోందని విమర్శించారు. ముఖ్యంగా వృద్ధులు, బీడీ కార్మికుల పెన్షన్ల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం అన్యాయమన్నారు.

ఇటీవల ప్రభుత్వం పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రకటించిన నేపథ్యంలో మీసేవ కేంద్రాలకు వెళ్లిన వృద్ధులు, బీడీ కార్మికులకు దరఖాస్తు చేసుకునే అవకాశం వెబ్‌సైట్‌లో కనిపించడం లేదని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లోనూ వృద్ధాప్య, బీడీ కార్మికుల వివరాల నమోదు కోసం ప్రత్యేకంగా ఎలాంటి అవకాశం లేకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారా? లేదా? వెబ్‌సైట్‌లో అవకాశం కనిపించకపోవడానికి సాంకేతిక సమస్య ఏమైనా ఉందా? అనే అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని పవన్ రెడ్డి డిమాండ్ చేశారు.

ఆగస్టు 15 నుంచి పెన్షన్లను పెంచి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో వృద్ధులు, బీడీ కార్మికులకు కూడా పెంచిన పెన్షన్ అందించాలని కోరారు. ఎన్నికల హామీలను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# గ్రామ అభివృద్ధికి ఉపసర్పంచ్ ముప్పూరి గణేష్ కుమార్ చేయూత



**పెద్దమందడి,ఆగస్టు13(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామ ఉపసర్పంచ్, రాష్ట్ర ఉపసర్పంచుల సంఘం కార్యదర్శి ముప్పూరి గణేష్ కుమార్ గ్రామ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం గ్రామ పారిశుద్ధ్య ట్రాక్టర్‌కు లౌడ్‌స్పీకర్ సెట్‌ను ట్రాక్టర్ డ్రైవర్ ఊదరి ఆంజనేయులుకు స్వయంగా బహూకరించారు. అలాగే గ్రామ ప్రారంభంలోని వాటర్ ట్యాంక్ వద్ద టైల్స్ ఏర్పాటు పనులు చేపట్టారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు ముప్పూరి చెన్నయ్య, బీజేపీ గ్రామ సీనియర్ నాయకులు పెద్ది శ్రీనివాసులు సాగర్, గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షులు కావలి ఆంజనేయులు, బీజేవైఎం నాయకులు భూపని బాలరాజు, మొగిలి అశోక్, జుర్రు రాజు, ఊదరి యాదగిరి, కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబర్ జాజుల గణేష్, ముప్పూరి బ్రహ్మమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి చొరవ చూపుతున్న ముప్పూరి గణేష్ కుమార్‌ను వారు అభినందించి తమ సంతోషం వ్యక్తం చేశారు.

# హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- **జమ్మికుంట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా**




**జమ్మికుంట టౌన్ ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** హమాలీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ మండల్ హమాలీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో జమ్మికుంట తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా కొప్పుల శంకర్ మాట్లాడుతూ హమాలీ కార్మికులు అనేక సంవత్సరాలుగా ఎగుమతులు, దిగుమతుల పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లకు పైగా గడిచినా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. హమాలీ కార్మికుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్మికులందరికీ ఆరోగ్య కార్డులు జారీ చేసి ఉచిత వైద్య సేవలు అందించాలని, 55 ఏళ్లు నిండిన ప్రతి హమాలీ కార్మికుడికి నెలకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇండ్లు లేని హమాలీ కార్మికులకు ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి 120 గజాల స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కార్మికులకు ప్రభుత్వం నేరుగా గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. ప్రమాదాల్లో మరణించే హమాలీ కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

కార్మికుల ఇతర సమస్యలను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కొప్పుల శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు జక్కుల రమేష్ యాదవ్, రావుల ఓదేలు, కొండ్ర క్రాంతి, మారపల్లి కిరణ్, పుట్టపాక రాజేందర్, సంతోష్, సుమన్, శ్రీనివాస్, ప్రవీణ్, సురేష్, శివబండి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకర జీవనానికి ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి




**జమ్మికుంట టౌన్ ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** శరీరానికి అవసరమైనంత స్వచ్ఛమైన గాలిని పీల్చడం, తగినంత మంచినీరు తీసుకోవడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని ధర్మారం ఒకటో వార్డు కౌన్సిలర్ పోలు దివ్య-బిక్షపతి అన్నారు.

బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, జమ్మికుంట ఆదిత్య-అమృత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో గురువారం ధర్మారం గ్రామంలోని ఒకటో వార్డు పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కౌన్సిలర్ మాట్లాడుతూ ఆరోగ్యానికి కీలకమైన గాలి, నీటి విషయంలో ప్రజలు నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు.

ప్రముఖ వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ మహిపాల్ మాట్లాడుతూ వయసు, ఎత్తుకు అనుగుణంగా శరీర బరువు ఉండాలని తెలిపారు. అధిక బరువు ఉన్నవారు బరువు తగ్గేందుకు, తక్కువ బరువు ఉన్నవారు ఆరోగ్యకరమైన పద్ధతిలో బరువు పెరిగేందుకు కృషి చేయాలని సూచించారు. ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడంతో పాటు నడక, వ్యాయామాన్ని నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని అన్నారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి మాట్లాడుతూ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోలేని గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.

జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ రిఫైన్డ్ నూనెల వినియోగాన్ని తగ్గించాలని, వేపుళ్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలను ఎక్కువగా ఉడికించకుండా తీసుకోవడం ద్వారా పోషక విలువలను కాపాడుకోవచ్చని తెలిపారు. మహిళలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటిస్తే ప్రతి ఇల్లు ఆరోగ్యకేంద్రంగా మారుతుందని అన్నారు.

నిరుపేదలకు వైద్య సేవలు అందించాలనే సామాజిక బాధ్యతతో బాలవికాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలకు తమ ఆసుపత్రి వైద్య బృందం సంపూర్ణ సహకారం అందిస్తోందని ఆదిత్య-అమృత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత ఎలుక దేవేందర్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రజలకు అందిస్తున్న ఈ వైద్య సేవలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని అన్నారు.

కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ కె. సుమలత, రెండో వార్డు కౌన్సిలర్ పోల్నేని వేణుగోపాలరావు, ఆసుపత్రి ప్రజా సంబంధాల ప్రతినిధులు రఫీక్, దుర్గాప్రసాద్, సిబ్బంది అనిల్ రావు, మహేష్, శ్రావణ్, రంజిత్, పూజ, సంతోషిని, సుచిత్రతో పాటు వార్డు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఇంటింటా త్రివర్ణ పతాకం.. గుండెగుండెలో దేశభక్తి



**జమ్మికుంట టౌన్ ఆగస్టు 13, (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని, ప్రతి గుండెలో దేశభక్తి వెల్లివిరియాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ అన్నారు.

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి భారీ జాతీయ జెండాతో నిర్వహించిన ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ జెండా దేశ గౌరవానికి ప్రతీక అని, త్రివర్ణ పతాకం ప్రతి ఒక్కరిలో దేశభక్తి, ఐక్యత, స్ఫూర్తిని నింపుతుందని అన్నారు.

దేశం కోసం, దేశ ప్రజల కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇంటింటా త్రివర్ణ పతాకం, గుండెగుండెలో దేశభక్తి అనే స్ఫూర్తితో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జైహింద్, వందేమాతరం అంటూ దేశభక్తి నినాదాలు చేశారు.

ర్యాలీలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందించాలి

- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**పెద్దమందడి,ఆగస్టు13(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం పెద్దమందడి మండలం బుగ్గపల్లి వద్ద ఉన్న 75 ఎంఎల్డీ సామర్థ్యం గల మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్‌ను ఆయన సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ప్లాంట్ ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మొక్కను నాటారు. అనంతరం మిషన్ భగీరథ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటరమణతో కలిసి ప్లాంట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. గౌరీదేవిపల్లి రిజర్వాయర్ నుంచి ప్లాంట్‌కు నీరు చేరే విధానం, నీటి వడపోత, ఫిల్టరేషన్ ప్రక్రియ, వివిధ దశల్లో నీటిని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేసే విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను పరిశీలించిన కలెక్టర్, నీటి నాణ్యత నిర్ధారించే పరీక్షల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ నుంచి సరఫరా చేసే సమయంలో ఉన్న నీటి నాణ్యత క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరే వరకు అదే స్థాయిలో కొనసాగుతుందో లేదో నిర్ధారించేందుకు గ్రామాల్లోనూ నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలని ఆదేశించారు.నీటి శుద్ధి ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ అంజి, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక సర్పంచ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంపై డిపిఓ కు ఫిర్యాదు

**ఖిల్లా ఘనపూర్,ఆగస్టు13(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలం ఆగారం గ్రామ పంచాయతీ కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామ నాయకులు జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) రఘునాథ్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు.గ్రామంలో వినియోగంలో లేని విద్యుత్ స్తంభం ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని, దానిని తొలగించాలని అధికారులు సూచించినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. అలాగే వాటర్ ట్యాంక్ నుంచి తాగునీరు వృథాగా పోతున్నా పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.పంచాయతీ కార్యదర్శి విధులకు సక్రమంగా హాజరు కాకుండా గ్రామంలో అందుబాటులో ఉండటం లేదని పేర్కొంటూ, ఈ విషయంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డీపీఓను కోరారు. డీపీఓను కలిసిన వారిలో మండల కాంగ్రెస్ నాయకుడు మున్నూరు జయాకర్, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్, మాజీ చైర్మన్ దేవన్న, శ్రీను, రమేష్, దేవుడు తదితరులు పాల్గొన్నారు.



# హామీలకు కాలం చెల్లింది.. ఇక కూలీల పోరాటమే!




- **వ్యవసాయ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి**
- **బీకేయంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు**

**ఎల్కతుర్తి ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** ఎన్నికల సమయంలో వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేయంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు విమర్శించారు. హామీలకు కాలం చెల్లిందని, ఇక వ్యవసాయ కూలీల హక్కుల కోసం పోరాటమే మార్గమని స్పష్టం చేశారు.

హనుమకొండలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు మునిగాల బిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకట్రాములు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున రెండు విడతలుగా అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి 32 నెలలు గడిచినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా జమ చేయలేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం కూలీల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మందికి పైగా వ్యవసాయ కార్మికులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కూలీలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. 32 నెలలకు సంబంధించిన రూ.32 వేల బకాయిలను ప్రతి అర్హత కలిగిన వ్యవసాయ కూలీ బ్యాంకు ఖాతాలో వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు.

అలాగే 57 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత పింఛన్ మంజూరు చేయాలని, పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు, వికలాంగులకు రూ.6 వేలకు పెంచాలని కోరారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారందరికీ పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే వ్యవసాయ కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వెంకట్రాములు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మునిగాల బిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్, ఇల్లందుల రాములు, అలువాల రాజు, జేరిపోతుల శిరీష తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణం పోయే వరకు.. అధికారుల కళ్లు తెరవవా?

- **ఎల్కతుర్తి హైవేపై రక్షణ లేని మురికి కాల్వ.. ప్రమాదాలకు ఆహ్వానం!**
- **ప్రమాదం జరిగినా పట్టించుకోని అధికారులు.. గ్రామస్థుల ఆగ్రహం**

**ఎల్కతుర్తి ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** మండల కేంద్రంలోని హైవే రోడ్డుపై గురువారం మధ్యాహ్నం తృటిలో ప్రమాదం తప్పినా.. అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదని ఎల్కతుర్తి గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌కు సుమారు 200 గజాల దూరంలో వాసు మీ సేవా కేంద్రం సమీపంలోని మురికి కాల్వలోకి ఓ బైక్ అదుపుతప్పి పడిపోయింది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.అయితే ఇదే ప్రాంతంలో గతంలోనూ బైక్ కాల్వలో పడిన ఘటనలు చోటుచేసుకున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.రక్షణ లేని కాల్వ.. ప్రమాదాలకు నిలయంగా మారుతున్నా పట్టించుకునే నాథుడేరీ? అంటూ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. హైవేను ఆనుకుని ఉన్న మురికి కాల్వకు రక్షణ గోడలు, బండలు, అవసరమైన చోట కప్పు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో కాల్వ కనిపించకపోవడంతో ప్రమాదాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రమాదం జరిగిన ప్రతిసారీ స్పందించడం కాకుండా ముందుగానే ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రాణనష్టం జరిగిన తర్వాత మేల్కొనే పాలన కాకుండా.. ప్రాణాలను కాపాడే పాలన కావాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, సంబంధిత అధికారులు వెంటనే సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి మురికి కాల్వకు శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. మరోసారి ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవిస్తే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని అధికారులను ప్రశ్నించారు.ఇకనైనా అధికారులు కళ్లు తెరిచి కాల్వకు రక్షణ ఏర్పాట్లు చేయాలని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆపాలని ఎల్కతుర్తి గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



# నాలుగేళ్ల నిరీక్షణకు తెర



**బుద్ధారంలోని 40 కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రొసీడింగ్స్**

**వనపర్తి,ఆగస్టు13(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా బుద్ధారం గ్రామంలోని 40 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల నాలుగేళ్ల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో పెండింగ్‌లో ఉన్న అధికారిక ప్రక్రియ పూర్తికావడంతో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు.నాలుగేళ్ల క్రితం ఇళ్లు మంజూరైనప్పటికీ బిల్లులు, అధికారిక ప్రక్రియ పూర్తికాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పులు, వడ్డీలకు డబ్బులు తెచ్చి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆవేదన చెందారు. లబ్ధిదారుల సమస్యను ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, అధికారులతో సమీక్షించి పెండింగ్ ప్రక్రియను పూర్తి చేయడానికి చొరవ చూపారు. అనంతరం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి చేతుల మీదుగా 40 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లబ్ధిదారులకు అందజేస్తున్నది కేవలం ప్రొసీడింగ్ మాత్రమే కాదని, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వానికి ఇది నిదర్శనమని అన్నారు.తమ సమస్యను పట్టించుకుని పరిష్కరించిన ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగేళ్లుగా ఎదురుచూసిన తమకు నేడు ప్రొసీడింగ్స్ అందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో గోపాలపేట తహసీల్దార్ తిలక్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యాశీల రెడ్డి, అచ్యుత రామారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోటుక చంద్రయ్య, లక్ష్మీతండా సర్పంచ్ పీత్య నాయక్, మధుకర్, దేవాదాయ కమిటీ చైర్మన్ పెంటారావు, మాజీ ఉపసర్పంచ్ నాగరాజు, నరేందర్ గౌడ్, లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల చదువుకు దివ్యాంగుల చేయూత

- **40 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి, బిస్కెట్ల పంపిణీ.**




**సత్తుపల్లి, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** పేద విద్యార్థుల చదువుకు తమవంతు సహకారం అందిస్తూ దివ్యాంగులు ఆదర్శంగా నిలిచారు. సత్తుపల్లి మండలం సిద్ధారం గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో 1 నుంచి 3వ తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు స్వర్ణిక చారిటబుల్ ట్రస్ట్ దివ్యాంగుల సేవా ఆశ్రమం ఆధ్వర్యంలో విద్యా సామగ్రి, బిస్కెట్లు పంపిణీ చేశారు. శ్రీ పొన్నగంటి అనుదీప్ స్పాన్సర్ చేయగా.. ఆశ్రమ నిర్వాహకుడు, దివ్యాంగుడు వలపర్ల రవికుమార్ విద్యార్థులకు పలకలు, బలపాలు, బిస్కెట్లు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. సురేష్‌కుమార్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు గద్దల రామకృష్ణ, గద్దల హర్ష ప్రణీత్, కిన్నెర రాంబాబు తదితరులు పాల్గొన్నారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా నిలుస్తూ సేవా కార్యక్రమం చేపట్టిన స్వర్ణిక చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- **విశ్వశాంతిలో 'వికసిత్ భారత్' ప్రతిజ్ఞ.**






**సత్తుపల్లి, ఆగస్టు 13(తెలంగాణ ముచ్చట్లు):** మాదక ద్రవ్యరహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన వ్యసన ముక్తి ప్రతిజ్ఞా మహోద్యమాన్ని సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాసంస్థలో గురువారం ప్రారంభించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సత్తుపల్లి శాఖ ఇన్‌చార్జి రాధిక మాట్లాడుతూ.. 'వికసిత్ భారత్' లక్ష్యసాధనలో భాగంగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చైతన్యవంతమైన పౌరులతోనే బలమైన సమాజం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మద్యం, మాదక ద్రవ్యాలు, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆనందకరమైన, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యరహిత భారతదేశ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని పిలుపునిచ్చారు. విశ్వశాంతి ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ప్రేమ, కరుణ, సేవాభావం, నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యరహిత, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలనే ఆశయంతో దేశవ్యాప్తంగా బ్రహ్మకుమారీస్ చేపడుతున్న కార్యక్రమం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సత్తుపల్లి శాఖ బాధ్యులు వరప్రసాద్, ప్రమీల, నరసింహులు, వెంకట్రావుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గణప సముద్రం భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా కృషి

- **మెరుగైన పరిహారం కోసం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ**




**వనపర్తి,ఆగస్టు13(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా గణప సముద్రం రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. రైతుల ప్రయోజనాలతో పాటు ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడేలా భూసేకరణ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ కిల్లు శివకుమార్ నాయుడు, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి బుద్ధారం, ఘనపూర్, గణపసముద్రం భూ నిర్వాసిత రైతులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. రిజర్వాయర్ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందనుందని, అదే సమయంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం తగ్గకుండా బండ్ ఎత్తు పెంచే అవకాశం ఉందా అనే అంశంపై సమగ్ర సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీనివల్ల భూసేకరణ విస్తీర్ణం తగ్గుతుందని తెలిపారు.ప్రస్తుతం నిబంధనల ప్రకారం ఎకరాకు రూ.11.25 లక్షల పరిహారం చెల్లించాల్సి ఉండగా, రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మెరుగైన పరిహారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. రైతులు ఎకరాకు రూ.15 లక్షలు కోరగా, కనీసం రూ.14 లక్షలు లేదా సాధ్యమైనంత మెరుగైన పరిహారం అందేలా చూడాలని సూచించారు. ఇల్లు లేని పేద భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాల్సి ఉంటుందని, రైతులు, ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు చర్చల ద్వారా అంగీకారానికి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ కిల్లు శివకుమార్ నాయుడు కూడా చర్చల ద్వారా సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, ఇరిగేషన్ ఎస్ఈ చంద్రశేఖర్, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ తిరుపతయ్య, ఏ.డీ. సర్వే శ్రీనివాసులు, తహసీల్దార్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు నవనీత, అచ్యుతరావు, భూ నిర్వాసిత రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శివాలయ సేవకు నూతన ధర్మకర్తల ప్రతిజ్ఞ





- **ప్రమాణ స్వీకారం చేయించిన దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత**

**ఎల్కతుర్తి, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం జీల్గుల శ్రీ శివాలయ నూతన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ వరంగల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరిగింది.

దేవాదాయ, ధర్మాదాయ శాఖ చట్టం 30/1987 ప్రకారం జారీ చేసిన నియమ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని నూతన ధర్మకర్తల మండలి సభ్యులతో ఇన్‌స్పెక్టర్ నందనం కవిత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ధర్మకర్తల మండలి సభ్యుల అభిప్రాయం మేరకు పదవుల ఎంపిక జరిగింది. చైర్మన్‌గా ముచ్చ బుచ్చిరెడ్డి ఎన్నికయ్యారు.

ధర్మకర్తల మండలి సభ్యులుగా గూటం జోగిరెడ్డి, రావుల రమేష్, తంగెళ్ల ప్రవీణ్, లక్ష్మీ, అయ్యగారు గోపిశర్మ కొనసాగనున్నారు.

ఈ సందర్భంగా చైర్మన్ ముచ్చ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ శివాలయ అభివృద్ధికి నూతన ధర్మకర్తల మండలి సమష్టిగా కృషి చేస్తుందని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని చెప్పారు. ఆలయ అభివృద్ధిలో భక్తులు, గ్రామస్తుల సహకారం తీసుకుంటామని పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఘణబోయిన సృజన రాజు యాదవ్, ఆలయ సిబ్బంది, భక్తులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, స్థానికులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# విభజన విషాదాన్ని మరువరాదు



- **లక్షల కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసిన ఘటన**
- **మానవ చరిత్రలోనే అతిపెద్ద వలసలలో ఒకటి**
- **విద్వేష రాజకీయాల ప్రమాదానికి హెచ్చరిక**
- **ఐక్యతే భవిష్యత్ తరాలకు మార్గం**

**డెస్క్, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** భారత ఉపఖండ చరిత్రలో 1947 సంవత్సరం ఒకవైపు స్వాతంత్ర్య సాధనకు గుర్తుగా నిలిచితే, మరోవైపు విభజన విషాదానికి కూడా సాక్ష్యంగా నిలిచింది. శతాబ్దాల విదేశీ పాలనకు ముగింపు పలుకుతూ భారత్ స్వాతంత్ర్యాన్ని పొందిన సందర్భంలోనే దేశ విభజన జరిగింది. ఆ నిర్ణయం లక్షలాది మంది జీవితాలను తలకిందులు చేసింది. వేలాది కుటుంబాలు తమ పుట్టిన ఊర్లు, ఇళ్లు, ఆస్తులు, జ్ఞాపకాలను వదిలి అనిశ్చిత భవిష్యత్తు వైపు ప్రయాణించాల్సి వచ్చింది. అందుకే ప్రతి ఏడాది ఆగస్టు 14ను విభజన విపత్తుల స్మృతి దినంగా పాటిస్తూ ఆ విషాద ఘట్టాన్ని గుర్తు చేసుకుంటున్నారు. దేశ విభజన సమయంలో జరిగిన మానవ విషాదం పరిమాణాన్ని అంచనా వేయడం కూడా కష్టమే. చరిత్రకారుల అంచనాల ప్రకారం కోట్లాది మంది సరిహద్దులు దాటి వలస వెళ్లాల్సి వచ్చింది. అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. రైళ్లు శవాలతో నిండిపోయి గమ్యస్థానాలకు చేరుకున్న ఘటనలు, గ్రామాలు ఖాళీ అయిన దృశ్యాలు, కుటుంబ సభ్యులు విడిపోయిన సంఘటనలు ఇప్పటికీ చరిత్ర పుటల్లో బాధాకరంగా నిలిచిపోయాయి. స్వాతంత్ర్య ఆనందం మధ్యలోనే అనేక కుటుంబాలు కన్నీటి కథలను మిగుల్చుకున్నాయి. మత విద్వేషాలు ఎంతటి ప్రమాదాలకు దారి తీస్తాయో విభజన సంఘటన ప్రపంచానికి స్పష్టంగా చూపించింది. రాజకీయ నిర్ణయాలు సామాన్య ప్రజల జీవితాలపై ఎంతటి ప్రభావం చూపుతాయో కూడా ఆ ఘటన నిరూపించింది. తరతరాలుగా కలిసి జీవించిన ప్రజలు ఒక్కసారిగా అనుమానాలు, భయాలు, ద్వేషాలతో విడిపోయిన పరిస్థితులు ఏర్పడ్డాయి. శాంతియుత సహజీవనానికి బదులుగా ఘర్షణలు చోటుచేసుకోవడం వల్ల మానవ విలువలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. విభజన సమయంలో అత్యధికంగా నష్టపోయింది సాధారణ ప్రజలే. రాజకీయ నాయకులు నిర్ణయాలు తీసుకున్నప్పటికీ వాటి భారం సామాన్య కుటుంబాలపై పడింది. రైతులు తమ భూములను కోల్పోయారు. వ్యాపారులు తమ ఆస్తులను వదిలి వెళ్లాల్సి వచ్చింది. మహిళలు, చిన్నారులు అనేక కష్టాలను ఎదుర్కొన్నారు. ఎన్నో కుటుంబాలు తమ బంధువుల గురించి ఎప్పటికీ తెలుసుకోలేకపోయాయి. మానవ చరిత్రలోనే అతిపెద్ద నిర్బంధ వలసలలో ఒకటిగా ఈ సంఘటన గుర్తింపు పొందింది. విభజన వల్ల ఏర్పడిన మానసిక గాయాలు చాలా కాలం వరకు కొనసాగాయి. తమ స్వస్థలాలను విడిచి వచ్చిన ప్రజలు కొత్త ప్రాంతాల్లో జీవితాలను పునర్నిర్మించుకోవడానికి సంవత్సరాల పాటు పోరాడాల్సి వచ్చింది. అయినప్పటికీ వారు ధైర్యం కోల్పోలేదు. కష్టాలను అధిగమించి కొత్త జీవనాన్ని నిర్మించుకున్నారు. వారి పోరాటం, సహనం, ఆత్మవిశ్వాసం నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తాయి. విభజన విపత్తుల స్మృతి దినం గతాన్ని తలచుకుని బాధపడటానికే కాదు, చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవడానికి కూడా అవసరం. విద్వేషాలు, అసహనం, విభజన భావజాలం సమాజాన్ని ఎంతటి ప్రమాదంలోకి నెట్టగలవో గుర్తు చేస్తుంది. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ బలం అనే విషయాన్ని మరోసారి చాటి చెబుతుంది. సమాజంలో శాంతి, సామరస్యం, పరస్పర గౌరవం ఎంత ముఖ్యమో ఈ రోజు మనకు గుర్తు చేస్తుంది. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక ప్రాంతాలు మత, జాతి, భాషా విభేదాల కారణంగా ఘర్షణలను ఎదుర్కొంటున్నాయి. అలాంటి సమయంలో భారత విభజన చరిత్ర ఒక హెచ్చరికగా నిలుస్తుంది. చిన్నచిన్న విభేదాలు పెద్ద సంక్షోభాలకు దారి తీయకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో సంభాషణ, సహనం, పరస్పర గౌరవం ద్వారానే సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని చరిత్ర చెబుతోంది. యువతకు విభజన చరిత్ర గురించి సమగ్ర అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యాసంస్థలు, కుటుంబాలు, సమాజంపై ఉంది. కేవలం తేదీలు, సంఘటనలుగా కాకుండా వాటి వెనుక ఉన్న మానవ వేదనను కూడా వారికి తెలియజేయాలి. అప్పుడు మాత్రమే శాంతి విలువ, ఐక్యత ప్రాధాన్యం, సామరస్య సమాజం అవసరం వంటి అంశాలు మరింత బలంగా అర్థమవుతాయి.

దేశం అభివృద్ధి చెందాలంటే ప్రజల మధ్య పరస్పర విశ్వాసం అత్యంత కీలకం. మతం, భాష, ప్రాంతం, కులం వంటి అంశాలు విభేదాలకు కారణం కాకుండా వైవిధ్యానికి ప్రతీకలుగా మారాలి. భారత రాజ్యాంగం అందించిన సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం వంటి విలువలను కాపాడుకోవడం ద్వారా మాత్రమే విభజన వంటి విషాదాలు మళ్లీ పునరావృతం కాకుండా నిరోధించగలం. విభజన విపత్తుల స్మృతి దినం లక్షలాది మంది బాధితుల జ్ఞాపకాలకు నివాళి అర్పించే సందర్భం. అదే సమయంలో భవిష్యత్ తరాలకు ఐక్యత, సహనం, సామరస్యం అనే విలువలను అందించే అవకాశం కూడా. గతంలోని విషాదాలను గుర్తుంచుకోవడం వాటిని తిరిగి జరగనీయకుండా ఉండటానికే. చరిత్ర ఇచ్చిన ఈ గుణపాఠాన్ని ప్రతి తరం గుర్తుంచుకుని, భిన్నత్వంలో ఏకత్వాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారానే బాధితుల త్యాగాలకు నిజమైన గౌరవం చెల్లించినవారమవుతాం.

# డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ మోసాలు

- **సాంకేతిక ప్రగతితో పాటు పెరుగుతున్న ప్రమాదాలు**
- **క్షణాల్లో ఖాతాలు ఖాళీ చేస్తున్న మోసగాళ్లు**
- **అప్రమత్తతే ఉత్తమ రక్షణ**
- **ప్రజల్లో అవగాహన పెంపే పరిష్కారం**

**డెస్క్, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** సాంకేతిక విప్లవం మానవ జీవితాన్ని ఎన్నో విధాలుగా సులభతరం చేసింది. బ్యాంకింగ్ సేవలు, ఆన్‌లైన్ కొనుగోళ్లు, ప్రభుత్వ సేవలు, విద్య, వైద్యం వంటి అనేక రంగాలు డిజిటల్ వేదికలపైకి చేరడంతో పనులు వేగవంతమయ్యాయి. చేతిలోని మొబైల్ ఫోన్ ద్వారానే ప్రపంచాన్ని చేరుకునే అవకాశం ఏర్పడింది. అయితే ఈ సౌలభ్యాలతో పాటు కొత్త రకమైన నేరాలు కూడా పెరుగుతున్నాయి. ముఖ్యంగా సైబర్ మోసాలు సామాన్య ప్రజల నుంచి వ్యాపార సంస్థల వరకు అందరినీ ఆందోళనకు గురిచేస్తున్నాయి. సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ మోసగాళ్లు అమాయకుల సొమ్మును కాజేస్తున్న ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గతంలో మోసాలు ప్రత్యక్షంగా జరిగేవి. ఇప్పుడు అవి మొబైల్ ఫోన్లు, సందేశాలు, సామాజిక మాధ్యమాలు, నకిలీ వెబ్‌సైట్లు, నకిలీ దరఖాస్తులు, పెట్టుబడి పథకాల రూపంలో జరుగుతున్నాయి. ఒకప్పుడు పట్టణాలకు మాత్రమే పరిమితమైన ఈ నేరాలు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాయి. బ్యాంకు అధికారులమని, ప్రభుత్వ ప్రతినిధులమని, ప్రముఖ సంస్థల ఉద్యోగులమని చెప్పి ప్రజలను నమ్మించి వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఒక్కసారి ఆ వివరాలు మోసగాళ్ల చేతికి చిక్కితే ఖాతాల్లోని డబ్బు క్షణాల్లో మాయమవుతోంది.

సైబర్ మోసాల విజయానికి ప్రధాన కారణం ప్రజలలో సరైన అవగాహన లేకపోవడమే. అనుమానాస్పద సందేశాలను తెరవడం, తెలియని లింకులను నొక్కడం, వ్యక్తిగత వివరాలను ఇతరులకు చెప్పడం, ఒకసారి ఉపయోగించే రహస్య సంఖ్యలను పంచుకోవడం వంటి చర్యలు మోసగాళ్లకు అవకాశంగా మారుతున్నాయి. కొందరు ఆకర్షణీయమైన బహుమతులు, ఉద్యోగ అవకాశాలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయనే ఆశతో మోసపోతున్నారు. వేగంగా డబ్బు సంపాదించాలనే ఆలోచన కూడా అనేక మందిని ప్రమాదంలోకి నెడుతోంది. సామాజిక మాధ్యమాల విస్తరణతో సైబర్ నేరాలకు కొత్త మార్గాలు లభించాయి. నకిలీ ఖాతాలు సృష్టించి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడం, స్నేహితుల పేర్లతో డబ్బు అడగడం, చిత్రాలను దుర్వినియోగం చేయడం, తప్పుడు ప్రచారాలు చేయడం వంటి ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. కొన్నిసార్లు వ్యక్తుల గౌరవప్రతిష్ఠలను దెబ్బతీయడం కూడా ఈ నేరాల లక్ష్యంగా మారుతోంది. అందువల్ల సామాజిక మాధ్యమాల వినియోగంలో కూడా జాగ్రత్తలు అవసరం.

కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతికతలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాల రూపం కూడా మారుతోంది. వ్యక్తుల స్వరాన్ని అనుకరించే విధంగా నకిలీ ధ్వని సందేశాలు రూపొందించడం, వాస్తవానికి దగ్గరగా కనిపించే చిత్రాలు, దృశ్యాలను సృష్టించడం వంటి పరిణామాలు కొత్త సవాళ్లను తీసుకొస్తున్నాయి. నిజమేదో, నకిలీదేదో గుర్తించడం కష్టమవుతోంది. అందుకే భవిష్యత్తులో సైబర్ భద్రత మరింత కీలక అంశంగా మారనుంది. ఈ సమస్యను కేవలం చట్ట అమలు సంస్థలు మాత్రమే ఎదుర్కోలేవు. ప్రజలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచడం, బలమైన రహస్య సంకేతాలను ఉపయోగించడం, అనుమానాస్పద సమాచారాన్ని వెంటనే ధృవీకరించడం, తెలియని వ్యక్తులపై విశ్వాసం ఉంచకపోవడం వంటి అలవాట్లు పెంపొందించుకోవాలి. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద నష్టానికి దారి తీస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రభుత్వాలు, బ్యాంకులు, విద్యాసంస్థలు, సమాచార సాంకేతిక సంస్థలు కలిసి ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ భద్రతపై అవగాహన కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి. సాంకేతిక పరిజ్ఞానం అందరికీ చేరుతున్న ఈ సమయంలో భద్రతా జ్ఞానం కూడా అదే స్థాయిలో విస్తరించాలి. సైబర్ నేరాలను అరికట్టడంలో చట్టాల పాత్ర కూడా ముఖ్యమైనది. నేరస్థులను గుర్తించడం, శిక్షించడం, అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో సమన్వయం పెంచడం అవసరం. డిజిటల్ నేరాలు భౌగోళిక సరిహద్దులను దాటిపోతున్నందున దేశాల మధ్య సహకారం కూడా కీలకంగా మారింది. ఆధునిక సాంకేతికతతో నేరాలను అరికట్టే వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న భారతదేశంలో సైబర్ భద్రతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రతి వ్యక్తి తన ఖాతా, తన సమాచారం, తన గుర్తింపును రక్షించుకోవడం దేశ ఆర్థిక భద్రతకు కూడా దోహదపడుతుంది. డిజిటల్ వ్యవస్థలపై ప్రజల్లో విశ్వాసం నిలవాలంటే భద్రతా ప్రమాణాలు మరింత బలపడాలి. డిజిటల్ యుగం అందించిన అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలంటే సాంకేతికతతో పాటు అప్రమత్తత కూడా అవసరం. సైబర్ మోసాలను కేవలం నేర సమస్యగా కాకుండా సామాజిక సవాలుగా చూడాలి. ప్రజల్లో అవగాహన, ప్రభుత్వ చర్యలు, సాంకేతిక భద్రత, బాధ్యతాయుత వినియోగం అనే నాలుగు అంశాలు కలిసినప్పుడే ఈ ముప్పును సమర్థంగా ఎదుర్కోగలం. డిజిటల్ ప్రగతి సురక్షితంగా కొనసాగాలంటే ప్రతి పౌరుడు సైబర్ భద్రతను తన దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాల్సిందే.



# జంక్ ఫుడ్‌పై సుప్రీం హెచ్చరిక

- **హెచ్చరిక లేబుళ్లపై కేంద్రానికి గడువు**
- **ప్రజారోగ్యమే ప్రధానమన్న ధర్మాసనం**
- **కార్పొరేట్ ఒత్తిడికి లొంగొద్దని వ్యాఖ్యలు**
- **రెండు వారాల్లో నిర్ణయం చెప్పాలని ఆదేశం**



**న్యూఢిల్లీ, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** అధిక ఉప్పు, చక్కెర, కొవ్వు కలిగిన ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుళ్ల అమలులో జరుగుతున్న జాప్యంపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన కీలక అంశంలో నిర్ణయాలు ఆలస్యం కావడం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ తమ తుది నిర్ణయాన్ని రెండు వారాల్లోగా వెల్లడించాలని ఆదేశించింది. నిర్ణయం తీసుకోకపోతే తామే తగిన చర్యలు తీసుకుంటామని ధర్మాసనం హెచ్చరించింది. జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార ఉత్పత్తుల ప్యాకెట్ల ముందు భాగంలో వినియోగదారులకు స్పష్టంగా కనిపించే విధంగా హెచ్చరిక లేబుళ్లు ఉండాలనే డిమాండ్‌పై విచారణ జరిగింది. ముఖ్యంగా చిన్నారులు, యువత ఆరోగ్యంపై జంక్ ఫుడ్ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంశం అత్యంత ప్రాధాన్యత కలిగి ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వం మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించింది. విచారణ సందర్భంగా తయారీ సంస్థలు తమ వ్యాపార ప్రయోజనాల దృష్ట్యా ఇటువంటి లేబుళ్లను వ్యతిరేకించవచ్చని, అయితే వినియోగదారులకు ఉత్పత్తిలోని పదార్థాల గురించి తెలుసుకునే హక్కు ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. తాము కొనుగోలు చేసే ఆహారంలో ఎంత ఉప్పు, చక్కెర, కొవ్వు ఉందో తెలుసుకోవడం ప్రజల ప్రాథమిక హక్కుల పరిధిలోకి వస్తుందని వ్యాఖ్యానించింది. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కంటే ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని కోర్టు స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ చాహర్ వాదనలు కూడా విచారణలో చర్చకు వచ్చాయి. అంతర్జాతీయ ప్రమాణాలను పూర్తిగా అమలు చేస్తే నమ్‌కీన్ వంటి భారతీయ సంప్రదాయ ఆహార పదార్థాలపై కూడా హెచ్చరిక గుర్తులు పడే అవకాశం ఉందని ఆయన వాదించారు. అయితే ఈ వాదనను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేస్తూ ఆరోగ్యపరమైన ప్రమాదాల విషయంలో రాజీ ఉండకూడదని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఇప్పటికే ఆహార ఉత్పత్తులపై ముందు భాగంలో హెచ్చరిక గుర్తులు తప్పనిసరి చేశాయి. అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ఉత్పత్తులను వినియోగదారులు సులభంగా గుర్తించేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి. భారతదేశంలో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలన్న డిమాండ్ గత కొంతకాలంగా వినిపిస్తోంది. ప్రజారోగ్య సంస్థలు, వైద్య నిపుణులు కూడా దీనికి మద్దతు తెలుపుతున్నారు. రెండు వారాల్లోగా కేంద్ర ప్రభుత్వం తన తుది నిర్ణయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆ గడువులోగా నిర్ణయం రాకపోతే తదుపరి విచారణలో తగిన ఉత్తర్వులు వెలువరిస్తామని ధర్మాసనం హెచ్చరించింది. దేశంలో పెరుగుతున్న ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు వంటి సమస్యల నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజల ఆరోగ్య హక్కుల పరిరక్షణకు సంబంధించి సుప్రీంకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

# మాజీ ప్రియుడి వేధింపులపై అనుపమ సంచలన వ్యాఖ్యలు

ప్రముఖ కథానాయిక అనుపమ పరమేశ్వరన్ తన గత ప్రేమబంధానికి సంబంధించిన సంచలన విషయాలను వెల్లడించారు. రెండేళ్లపాటు ఓ వ్యక్తితో కొనసాగిన సంబంధంలో తాను మానసికంగా, శారీరకంగా తీవ్ర వేధింపులకు గురైనట్లు తెలిపారు. అయితే ఆ వ్యక్తి ఎవరో మాత్రం ఆమె వెల్లడించలేదు. ప్రేమ పేరుతో తన జీవితంలోకి వచ్చిన ఆ వ్యక్తి.. తనను పూర్తిగా నియంత్రించేందుకు ప్రయత్నించాడని అనుపమ ఆరోపించారు. తాను ధరించే దుస్తులు, సామాజిక మాధ్యమాల్లో చేసే పోస్టులు, చివరకు ఎంచుకునే సినిమాల విషయంలోనూ ఆంక్షలు విధించేవాడని చెప్పారు. నటనను కూడా వదిలేయాలని ఒత్తిడి తెచ్చాడని తెలిపారు. పరిచయమైన కొద్ది నెలల్లోనే నిశ్చితార్థం, వివాహం చేసుకోవాలని ఒత్తిడి తెచ్చాడని వెల్లడించారు. డిప్రెషన్, పానిక్ ఎటాక్స్‌తో తీవ్ర ఇబ్బందులు

ఆ బంధం కారణంగా తాను తీవ్రమైన మానసిక కుంగుబాటుకు గురయ్యానని అనుపమ తెలిపారు. ఆందోళనతో పాటు తరచూ పానిక్ ఎటాక్స్ వచ్చేవని, శారీరకంగా కూడా బలహీనపడి బరువు తగ్గిపోయానని చెప్పారు. చిత్రీకరణ సమయంలో తన వాహనంలోకి వెళ్లి ఒంటరిగా ఏడ్చేదానినని, చివరకు తన సొంత తమ్ముడిని తాకడానికి కూడా భయపడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన కెరీర్‌లో భారీ విజయాన్ని అందుకున్న 'డ్రాగన్' సినిమా ప్రచార కార్యక్రమాలకు కూడా ఈ మానసిక వేదన కారణంగానే హాజరు కాలేకపోయానని తెలిపారు. ప్రముఖ హీరో కుమారుడి పేరుపై ఊహాగానాలు

అనుపమ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం తీవ్ర చర్చకు దారితీశాయి. గతంలో నటుడు విక్రమ్ కుమారుడు ధృవ్ విక్రమ్‌తో ఆమె ప్రేమలో ఉన్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో.. తాజాగా ఆమె చెప్పిన వ్యక్తి ఆయనే అయి ఉండవచ్చంటూ కొందరు నెటిజన్లు, కొన్ని మీడియా వర్గాలు ఊహాగానాలు వ్యక్తం చేస్తున్నాయి. అయితే అనుపమ స్వయంగా ఆ వ్యక్తి పేరును వెల్లడించలేదు. అందువల్ల ఈ ఊహాగానాలను వాస్తవంగా నిర్ధారించలేము. చాలా కాలం తర్వాత ఆ మానసిక గాయం నుంచి కోలుకున్నానని, ఇలాంటి విషపూరిత బంధాల్లో చిక్కుకున్న వారికి తన అనుభవం ఒక హెచ్చరికగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ విషయాలను బయటపెట్టినట్లు అనుపమ తెలిపారు.





## అల్లు అర్జున్ సినిమాలో జాన్వీ పాత్ర ఇదేనా?

**హైదరాబాద్, ఆగస్టు 13, 2026 (తెలంగాణ ముచ్చట్లు):** అల్లు అర్జున్ కథానాయకుడిగా 'జవాన్' దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. అల్లు అర్జున్ కెరీర్‌లోనే ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా భావిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి ఎప్పటికప్పుడు కొత్త విషయాలు వైరల్ అవుతున్నాయి.

గిరిజన రాణిగా జాన్వీ?

ఈ సినిమాలో జాన్వీ కపూర్ కీలక పాత్రలో నటించనున్నట్లు చాలాకాలంగా ప్రచారం జరుగుతోంది. అయితే ఆమె పాత్రపై చిత్రబృందం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం జాన్వీ కపూర్ ఈ సినిమాలో గిరిజన రాణి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఆమె పాత్ర కేవలం అందం కోసం కాకుండా కథలో కీలకంగా ఉంటుందని ప్రచారం జరుగుతోంది.

కథను మలుపు తిప్పే పాత్ర: జాన్వీ పాత్ర కథను మలుపు తిప్పే స్థాయిలో ఉంటుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అల్లు అర్జున్ పాత్రతో ఆమెకు ఎలాంటి సంబంధం ఉంటుంది? ఆమె పాత్ర కథలో ఎలాంటి కీలక పరిణామాలకు కారణమవుతుంది? అనే విషయాలపై అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. అయితే ఈ వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

## రజనీకాంత్‌తో తొలి పరిచయం గుర్తుచేసుకున్న శ్రియ

**చెన్నై, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** టాలీవుడ్, కోలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి శ్రియ శరణ్.. సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కలిసి నటించిన 'శివాజీ: ది బాస్' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్నారు. ఈ సినిమా శ్రియ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ సమయంలో రజనీకాంత్‌ను తొలిసారి కలిసిన సందర్భాన్ని శ్రియ గుర్తుచేసుకున్నారు.

దర్శకుడు శంకర్ ఒకరోజు తనకు ఫోన్ చేసి.. ''ఒక సినిమా ఉంది. అందులో పనిచేస్తావా?'' అని అడిగారని శ్రియ తెలిపారు. తాను వెంటనే అంగీకరించడంతో శంకర్ సరేనని చెప్పారని, ఆ తర్వాత చిత్రబృందం వద్దకు వెళ్లినప్పుడు అక్కడ ఎంతోమంది ప్రముఖులు కనిపించారని చెప్పారు. ఎ.ఆర్. రెహమాన్, రజనీకాంత్, సినిమాటోగ్రాఫర్ కే.వి. ఆనంద్ వంటి ప్రముఖులు అక్కడ ఉండటంతో.. ఇది చాలా పెద్ద సినిమా అయి ఉంటుందని అప్పుడే భావించానని శ్రియ తెలిపారు.

అనంతరం శంకర్ తనను పిలిచి.. ''మీ సహనటుడు రజనీకాంత్ సర్‌ను కలవండి'' అని చెప్పడంతో తాను ఒక్కసారిగా ఆశ్చర్యపోయానని శ్రియ గుర్తుచేసుకున్నారు. ''అవునా.. సరే!'' అంటూ ఆశ్చర్యంతో స్పందించానని చెప్పారు. ఆ సమయంలో రజనీకాంత్‌తో జరిగిన తొలి పరిచయం తనకు ఎంతో ప్రత్యేకమైన జ్ఞాపకంగా మిగిలిపోయిందని శ్రియ సరదాగా గుర్తుచేసుకున్నారు. 'శివాజీ: ది బాస్' చిత్రంలో రజనీకాంత్, శ్రియ జంట ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం అప్పట్లో భారీ విజయాన్ని అందుకోవడంతో పాటు, శ్రియ కెరీర్‌లోనూ కీలక చిత్రంగా నిలిచింది.



శుక్రవారం - 14 - ఆగస్టు 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ



**భీమదేవరపల్లి, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):**స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15ను పురస్కరించుకుని ములుకనూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమంనిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ములుకనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ఉప సర్పంచ్ మమత బాలకృష్ణ, వార్డు నంబర్ చిటుకూరి అనిల్ కుమార్ పాల్గొని విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు.విద్యార్థుల విద్యాభివృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆగస్టు 15న మానవ హక్కుల పరిరక్షణపై ప్రత్యేక చర్చ

**హైదరాబాద్, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):**దేశ స్వాతంత్ర్యాన్ని ఘనంగా జరుపుకోవడంతో పాటు ప్రతి ఒక్కరి బాధ్యతలను గుర్తు చేసుకునే రోజుగా ఆగస్టు 15ను నిర్వహించనున్నట్లు ఎస్‌జేఎఫ్ఐసీఆర్‌సీ (ఎస్ జె ఎఫ్ ఐ సి అర్ సి) చెరుకు రమేష్ తెలంగాణ హ్యూమన్ రైట్స్ సంస్థ సభ్యులు తెలిపారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా వందనం అనంతరం "తెలంగాణ రాష్ట్రంలో మానవ హక్కుల పరిరక్షణ మన సంస్థ పాత్ర" అనే అంశంపై ప్రత్యేక చర్చా



కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా (ఎస్ జె ఎఫ్ ఐ సి అర్ సి) తెలంగాణ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు చింతల విజయ్ కుమార్ ముదిరాజ్ మాట్లాడుతూమానవ హక్కుల పరిరక్షణ, ప్రజల్లో హక్కులపై అవగాహన కల్పించడం, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తిని పెంపొందించడం, మానవ హక్కుల ఉల్లంఘనలను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జేఎఫ్ఐసీఆర్‌సీ తెలంగాణ హ్యూమన్ రైట్స్ కుటుంబ సభ్యులు, ప్రతినిధులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తితో మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సంస్థ సభ్యులు పిలుపునిచ్చారు.

## విద్యార్థుల చదువుకు దాత చేయూత

- **చదువు కోసం నిత్యం నడక.. సైకిల్‌తో విద్యార్థులకు ఊరట**

**హుజురాబాద్,ఆగస్టు 13(తెలంగాణ ముచ్చట్లు ):** చదువు కోసం ప్రతిరోజూ రెండు మూడు కిలోమీటర్లు కాలినడకన పాఠశాలకు వెళ్లే కాట్రపల్లి, గుండ్లపల్లి గ్రామాల విద్యార్థులకు దాతలు అండగా నిలిచారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వారి ప్రయాణ కష్టాలను తగ్గించేందుకు సైకిల్‌ను అందజేశారు. శ్రీ సాయి చరణ్ (ఎం ఆర్ జీని తొమ్మిది ) ఛానల్ తరపున హుజురాబాద్‌కు చెందిన వారు విద్యార్థుల కోసం స్వయంగా ఒక సైకిల్‌ను కొనుగోలు చేసి అందించారు.



ప్రతిరోజూ దూరం నడిచి పాఠశాలకు వెళ్లాల్సిన విద్యార్థులకు ఈ సైకిల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు రవాణా సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం పాఠశాలకు వెళ్లడం, సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకోవడం కోసం కిలోమీటర్ల మేర నడవాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులు అలసటకు గురవడంతో పాటు చదువుకు కేటాయించే సమయం కూడా తగ్గుతోంది. ఈ పరిస్థితిని గుర్తించిన దాతలు విద్యార్థుల చదువుకు సహకరించే ఉద్దేశంతో సైకిల్ అందించడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి సహాయ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఒక సైకిల్ అందించడం ద్వారా విద్యార్థుల రోజువారీ ప్రయాణం సులభతరం కావడంతో పాటు పాఠశాలకు సమయానికి చేరుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు సమాజంలోని దాతలు అండగా నిలిస్తే మరింత మంది విద్యార్థులు విద్యలో ముందుకు సాగుతారని అన్నారు. విద్యార్థుల చదువుకు చేయూత అందించిన శ్రీ సాయి చరణ్ (ఎం ఆర్ జీని తొమ్మిది ) ఛానల్ వారికి విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా పేద విద్యార్థులకు అవసరమైన సహాయం అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అందించిన ఈ సైకిల్..వారి చదువుకు దాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని స్థానికులు పేర్కొన్నారు.

## పూసల సంఘానికి కమ్యూనిటీ హాల్ కోసం సీఎం రేవంత్‌రెడ్డికి వినతి

**జవహర్‌నగర్, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):**జవహర్‌నగర్‌లో పూసల సంఘానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ పూసల సంఘం అధ్యక్షుడు మధ్యబోయిన రాజు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రితో పాటు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ను మర్యాదపూర్వకంగా కలిసి పూసల సంఘం సమస్యలను వివరించారు. జవహర్‌నగర్‌లో గత 24 ఏళ్లుగా వివిధ కుల సంఘాలకు కుల భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించారని, అదే విధంగా పూసల సంఘానికి కూడా స్థలం కేటాయించాలని మధ్యబోయిన రాజు కోరారు. ప్రస్తుతం జవహర్‌నగర్‌లో పూసల సామాజిక వర్గానికి చెందిన 200కు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. తమ సామాజిక, కుటుంబ కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు సొంత భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయన వివరించారు. స్థలం కేటాయిస్తే సంఘం ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ నిర్మించి పేద, మధ్యతరగతి కుటుంబాలకు కూడా అందుబాటులో ఉండేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.



ఈ విషయంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ కార్యాలయం, కాప్రా తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. పూసల సంఘం అధ్యక్షుడు మధ్యబోయిన రాజు మాట్లాడుతూ.. "జవహర్‌నగర్‌లో పూసల సంఘానికి కూడా ఒక కమ్యూనిటీ హాల్ ఎంతో అవసరం. 200కు పైగా పూసల కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి. కార్యక్రమాలు, ఫంక్షన్లు, సమావేశాలు నిర్వహించుకునేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్, కాప్రా తహసీల్దార్ దయతలచి స్థలం కేటాయించాలి" అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పూసల సంఘం ఉపాధ్యక్షుడు పసుపులేటి వెంకన్న, ప్రధాన కార్యదర్శులు పగిడిపల్లి నవీన్‌కుమార్, మర్రి శీను, సహాయ కార్యదర్శులు చిన్నిపల్లి రజిత, మధ్యబోయిన శారద, పసులేటి కవిత, చేని చింటూ, కోశాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కౌశిక్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు తగవు

- **కమలాపూర్ సభను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదు**
- **జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్ జావేద్**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):** కమలాపూర్‌లో నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని రాజకీయ విమర్శలకు వేదికగా మార్చి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరికాదని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ దిలీప్ కుమార్, వైస్ చైర్మన్ జావేద్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కమలాపూర్ సభలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి



శ్రీకారం చుట్టిన విషయాన్ని మాత్రమే ప్రస్తావించారని తెలిపారు. అలాగే కమలాపూర్‌ను ఉప్పల్ మండలంగా ప్రకటించాలనే ప్రజల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఈ అంశాలను వక్రీకరించి వ్యక్తిగత విమర్శలు చేయడం రాజకీయ హుందాతనానికి విరుద్ధమన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా కౌశిక్ రెడ్డి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని, రైతులు, యువత, మహిళలు, దళితులు, బీసీలు, సాగునీరు, నిధులు, విద్య, వైద్యం తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజల గొంతుకగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు. "నువ్వు ఖమ్మం రెడ్డివైతే.. మేం కరీంనగర్ కౌశిక్ రెడ్డి మనుషులం" అంటూ కౌశిక్ రెడ్డిపై తమకున్న నిబద్ధతను వారు స్పష్టం చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత ఆరోపణలు, అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజా ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయకుండా ప్రజా సమస్యలపై చర్చించాలని సూచించారు. రాజకీయ విభేదాలు ప్రజా సమస్యల పరిష్కారానికే పరిమితం కావాలని, వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని కోరారు. ప్రజల మద్దతుతో పనిచేస్తున్న నాయకులను కించపరిచే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో అంతిమ తీర్పు ప్రజలదేనని అన్నారు. ప్రజా నాయకులపై అవమానకర వ్యాఖ్యలు, నిరాధార ఆరోపణలు కొనసాగితే బీఆర్ఎస్ శ్రేణులు ప్రజాస్వామ్యబద్ధంగా గట్టిగా స్పందిస్తాయని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల మదిలో ఉన్నాయని, రానున్న రోజుల్లో ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని వారు వ్యక్తం చేశారు.



## ఎన్ఐఓఎస్ ద్వారా 78 మంది ఖైదీలు పదో తరగతి ఉత్తీర్ణత

**చర్లపల్లి, ఆగస్టు 13 (తెలంగాణ ముచ్చట్లు):**తెలంగాణ జైళ్ల చరిత్రలో తొలిసారిగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) ద్వారా 78 మంది ఖైదీలు పదో తరగతి (ఎస్ఎస్‌సీ) పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఖైదీలలో విద్య, స్వీయాభివృద్ధి, పునరావాసాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ జైళ్ల శాఖ చేపట్టిన కార్యక్రమం విజయవంతమైంది. ఖైదీలు విద్యను కొనసాగించేలా జైళ్ల శాఖ ఎన్ఐఓఎస్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా చర్లపల్లి, నిజామాబాద్ కేంద్ర కారాగారాలతో పాటు హైదరాబాద్ ప్రత్యేక మహిళా కారాగారానికి చెందిన 108 మంది ఖైదీలు ఎస్ఎస్‌సీలో నమోదు చేసుకున్నారు. వారికి ప్రభుత్వ ఉపాధ్యాయులను కేటాయించడంతో పాటు అవసరమైన చోట ప్రైవేట్ ఉపాధ్యాయులను నియమించి, వారి వేతనాలను జైళ్ల శాఖ భరించింది.ఏడాది పాటు తరగతులు, మాక్ టెస్టులు, ప్రీబోర్డు పరీక్షలతో కూడిన క్రమబద్ధమైన విద్యా ప్రణాళిక ద్వారా ఖైదీలను పరీక్షలకు సిద్ధం చేశారు. ఫలితంగా చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి 56 మంది, నిజామాబాద్ కేంద్ర కారాగారం నుంచి 15 మంది, హైదరాబాద్ ప్రత్యేక మహిళా కారాగారం నుంచి ఏడుగురు చొప్పున మొత్తం 78 మంది ఉత్తీర్ణులయ్యారు. జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా, ఐపీఎస్ ఉత్తీర్ణులైన ఖైదీలకు ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఖైదీలు ప్రదర్శించిన పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసాన్ని ఆమె ప్రశంసించారు. విద్య ద్వారా జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే సంకల్పానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు.

**ఉత్తీర్ణులైన 78 మంది ఖైదీలకు ప్రత్యేక రిమిషన్**

విద్యపై ఖైదీలు చూపిన కృషి, క్రమశిక్షణకు గుర్తింపుగా ఎన్ఐఓఎస్ ద్వారా ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత సాధించిన 78 మంది ఖైదీలకు డైరెక్టర్ జనరల్ ప్రత్యేక రిమిషన్‌ను ప్రోత్సాహకంగా ప్రకటించారు. ఈ నిర్ణయం ఇతర ఖైదీలు కూడా విద్య వైపు అడుగులు వేయడానికి ప్రేరణగా నిలుస్తుందని డీజీ తెలిపారు.ఉత్తీర్ణులైన ఖైదీలను ఎన్ఐఓఎస్ ద్వారా సీనియర్ సెకండరీ (10+2) విద్య కొనసాగించేలా ప్రోత్సహించనున్నారు. మరో 47 మంది ఖైదీలు తాజాగా ఎస్ఎస్‌సీలో నమోదు చేసుకున్నారు. 10+2 పూర్తి చేసిన అనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ద్వారా బీఏ కోర్సుల్లో చేరే అవకాశం కల్పించనున్నారు. అలాగే ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులైన 78 మంది ఖైదీలు చర్లపల్లి కేంద్ర కారాగారంలోని ఐటీఐలో వివిధ సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులు అభ్యసించేందుకు అర్హులని డీజీ తెలిపారు. విద్య, నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో స్వయం ఆధారిత జీవితం వైపు సాగాలని ఆమె సూచించారు.కార్యక్రమంలో ఎన్ఐఓఎస్ జాయింట్ డైరెక్టర్ ఇన్‌చార్జ్ పరంప్రీత్ సింగ్, హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ డా. ప్రవీణ్ చౌహాన్, జైళ్ల శాఖ ఐజీ వై. రాజేష్, డీఐజీలు డా. డి. శ్రీనివాస్, ఎం. సంపత్, పలువురు జైలు సూపరింటెండెంట్లు, అధికారులు, ఎన్ఐఓఎస్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల స్థలాల జోలికొస్తే ఖబడ్దార్!

- **హుజురాబాద్‌లో జర్నలిస్టుల భారీ గర్జన.. స్వామిరెడ్డిపై చర్యలకు డిమాండ్**

**హుజురాబాద్,ఆగస్టు 13(తెలంగాణ ముచ్చట్లు ):** జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాల విషయంలో హుజురాబాద్‌లో నిరసనల సెగ రాజుకుంది. జర్నలిస్టుల నివేశన స్థలాలపై దాఖలైన కోర్టు కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని, కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డిపై పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హుజురాబాద్ ప్రెస్ క్లబ్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన భారీ ర్యాలీలో జర్నలిస్టులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామిరెడ్డి వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. జర్నలిస్టుల హక్కులను కాపాడాలని, వారికి కేటాయించిన ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.




**50 మంది జర్నలిస్టుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు**

హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, ప్రధాన కార్యదర్శి కామిని రవీందర్ మాట్లాడుతూ.. సుమారు యాభై మంది పేద జర్నలిస్టులకు సంబంధించిన ఇళ్ల స్థలాలపై కోర్టు కేసు వేయడం వల్ల వారి కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయని అన్నారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో జీవిస్తున్న జర్నలిస్టులకు సొంతింటి కల నెరవేర్చేందుకు కేటాయించిన స్థలాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కేవలం కక్షసాధింపు ధోరణితో జర్నలిస్టుల స్థలాల విషయంలో వివాదం సృష్టించడం సరికాదని, జర్నలిస్టుల హక్కులను హరించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.

**ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి**

స్వామిరెడ్డిపై నిరసనకారులు చేసిన పలు ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పనులు, బిల్లులకు సంబంధించి వచ్చిన ఆరోపణలతో పాటు హుజురాబాద్ పట్టణంలోని సర్వే నంబర్ నూట ఇరవై అయిదు లోని ప్రభుత్వ భూమికి సంబంధించిన ఆరోపణలపై వాస్తవాలను అధికారులు వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

**మంత్రులు జోక్యం చేసుకోవాలి**

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ప్రణవ్ బాబు తక్షణమే జోక్యం చేసుకోవాలని నాయకులు కోరారు. కోర్టు కేసుల సమస్యకు చట్టపరమైన పరిష్కారం చూపి అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**ఉద్యమ గీతాలతో హోరెత్తిన ధర్నా**

ర్యాలీ అనంతరం నిర్వహించిన ధర్నాలో కళాకారులు ఉద్యమ గీతాలు ఆలపించారు. వారి ఆటపాటలతో నిరసన ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు చందుపట్ల జనార్ధన్, వేల్పుల రత్నం, సందెల వెంకన్న, ప్రియదర్శిని, మాడుగుల ఓదెలు, సీనియర్ జర్నలిస్ట్ అంబాల ప్రభాకర్‌తో పాటు పలువురు జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. జర్నలిస్టులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, అవసరమైతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

## ధ్యానంతో మానసిక ప్రశాంతత

- **వ్యసనాలకు దూరంగా ఉండాలి ఆరోగ్యకరమైన జీవనాన్ని అలవర్చుకోవాలి**
- **బి.కె. శ్రీవాణి**

**హుజురాబాద్,ఆగస్టు 13(తెలంగాణ ముచ్చట్లు ):** మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని హుజురాబాద్ బ్రహ్మకుమారి సెంటర్ ఇన్‌చార్జ్ బి.కె. శ్రీవాణి సూచించారు. గురువారం బ్రహ్మకుమారి సెంటర్‌లో 'నషా ముక్త్ భారత్' ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి



ఉరుకులు పరుగుల జీవితంలో చాలామంది ఆరోగ్యంపై తగిన శ్రద్ధ చూపడం లేదన్నారు. రాజయోగ మెడిటేషన్ ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు ఆలోచనలు, ప్రవర్తనలో సానుకూల మార్పులు వస్తాయని తెలిపారు. బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పది కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. ఆరోగ్యకరమైన జీవితం, సామరస్య కుటుంబం, ఉజ్వల భవిష్యత్తు, అభివృద్ధి చెందిన దేశం కోసం ప్రతి ఒక్కరూ వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేయాలని కోరారు.యోగ, ధ్యానాన్ని జీవన విధానంగా అలవర్చుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. మాదకద్రవ్య రహిత దేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారితో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గుంటి రాజయ్య, శివరాత్రి ఈశ్వరయ్య, జ్యోతి రాణితో పాటు జర్నలిస్టులు కుడుతాడి బాపురావు, గూడూరి కొండల్ రెడ్డి, రాజమౌళి, సత్యరాజ్, ఇప్పకాయల సాగర్, సతీష్, పిట్ట శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in